www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 6 నవంబర్ 2022



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత

ప్రజాశక్తి -మండపేట

స్థానిక రాజరత్న జంక్షన్‌లో లూసీ సైన్ స్పీచ్ థెరపి సెంటర్ నందు వికలాంగ విద్యార్థులు15 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున స్కాలర్‌షిప్‌లను ట్రస్ట్ డైరెక్టర్ ఫౌండర్ సిస్టర్ లూసి పాస్టర్ విజయకుమార్, రాజేష్, సుధాకర్ శనివారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మండపేట, రామచంద్రపురంల్లో పేదలకు 25 కేజీలు చొప్పున బియ్యం, ఒక వికలాంగునికి వీల్ చైర్, రూ.15వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, వృద్ధులు కట్టకింపు రత్నం, యేసు రత్నం తదితరులు పాల్గొన్నారు.


స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులు

వసతి గృహాల్లో సౌకర్యాల లేమి

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


ఇన్‌సెట్‌లో (పెచ్చులూడుతున్న శ్లాబ్) వసతి గృహంలో తలుపులు లేని కిటికి

ప్రజాశక్తి -మండపేట

నిరుపేద విద్యార్థులకు ఉత్తమ విద్యతోపాటు వసతి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలను ఏర్పాటు చేసింది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో సంక్షేమ వసతి గృహాలు సమస్యలకు నిలయంగా మారాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు, మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శిథిల భవనాల్లో సరైన సదుపాయాలు లేకుండా సంక్షేమ హాస్టల్ కొనసాగుతున్నాయి. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని బిసి వెల్ఫేర్ ఆధ్వర్యంలో రావులపాలెం, మండపేట, రామచంద్రపురంల్లో 7 ప్రభుత్వ వెనుకబడిన తరగతుల వసతి గృహాలు ఉండగా అందులో 6 యువతి, యువకుల కళాశాలలకు చెందినవి కాగా మరోకటి ప్రీ మెట్రిక్ హాస్టల్ ఉన్నది. ప్రతి వసతి గృహానికి ముగ్గురు చొప్పున 21 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఇద్దరు చొప్పున 14 మంది సిబ్బంది ఉన్నారు. 449 మంది విద్యార్థులు ఈ గృహాల్లో వసతి పొందుతున్నారు. రావులపాలెంలో రెండు, రామ చంద్రపురంలో ఒకటి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

సమస్యలకు నిలయంగా..

మండపేట పట్టణంలోని న్యూకాలనీలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో 1994 సంవత్సరంలో ప్రీమెట్రిక్‌ను ప్రారంభించగా 2016లో కళాశాలగా వసతి గృహంగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ కళాశాలలో ముగ్గురు సిబ్బంది కుక్, కమాటి, వాచ్‌మెన్ సిబ్బంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఇద్దరే ఉన్నారు. చింతూరు, అడ్డతీగల, రంపచోడవరం, తదితర ప్రాంతాల నుంచి 76 మంది విద్యార్థులు ఇంటర్‌కు సంబంధించిన వివిధ కోర్సులలో ప్రయివేట్, ప్రభుత్వ కళాశాలలో చదువుకుంటు ఇక్కడ వసతి పొందుతున్నారు. ఈ వసతి గృహంలో మొత్తం 17 మరుగుదొడ్లు ఉండగా ఇందులో ఇటీవల నిర్మించిన ఏడు మాత్రమే విద్యార్థుల వినియోగానికి అనుకులంగా ఉన్నాయి. మిగిలినవి తలుపులు ఊడిపోయి ప్రమాదాలను తలపిసు_న్నాయి. భవనం పాక్షికంగా దెబ్బతినడంతో శ్లాబ్ నుంచి వర్షం వస్తుండటం, గదులకు, కిటికీలకు తలుపులు, గచ్చు పగిలిపోవడం, కాంపౌండ్ వాల్ లేకపోవడం తదితర సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రస్తుత చలికాలం నేపథ్యంలో విద్యార్థులకు మరిన్ని అవస్థలు తప్పవు. ఇది ఇలా ఉండగా మూడేళ్ల క్రితం భవనంపై నున్న మెట్ల రూపు గాలి వానకు పడిపోవడంతో మెట్ల నుంచి వరండాలోకి నీరు చేరుతుంది. స్థానిక అంకసాని చెర్వు గట్టున బాలికల యువతి ప్రీ మెట్రిక్ హాస్టల్‌లో 108 విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు.

మండపేట వసతి గృహంలో త్వరలో పనులు

ఈ విషయంపై బిసి వెల్ఫేర్ రామచంద్రపురం డివిజన్ సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి సాంబమూర్తిని వివరణ కోరగా నాడు-నేడులో మండపేట బాలుర వసతి గృహం ఎంపికచేశారని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -రామచంద్రపురం

ఈ నెల 12 జరిగే జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి దేవి పిలుపునిచ్చారు. మండల న్యాయాధికార సంస్థ ఆధ్వర్యంలో అవినీతి నిరోధక వారోత్సవాల్లో భాగంగా శనివారం పలు ప్రభుత్వ కార్యాలయాలు ద్రాక్షారామం గ్రామపంచాయతీలోనూ న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ముందుగా పట్టణంలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం మండల రెవెన్యూ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, సబ్ జైల్ నందు ఈ సదస్సులు జరిగాయి. లోక్ అదాలత్ చైర్మన్ కె.మాధవి దేవి మాట్లాడుతూ పేద వర్గాల వారికి ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని. కక్షిదారులు లోకాదాత్ ద్వారా తమ కేసులు రాజీ చేసుకోవచ్చు నని దీనిద్వారా సమయం, సొమ్ముఆదావుతుందనివివరించారు. జూనియర్ సివిల్ జడ్జ్ బి. వాణిశ్రీ, మెజిస్ట్రేట్ ఆర్. ఆశీర్వాదం పాల్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఎజిపి పిల్లి మురళిమోహన వెంకటరమణ, ప్యానల్ లాయర్లు పి. సత్యనారాయణ, దోమలపాటి సత్యనారాయణ, జెఎస్‌ఎస్ఎస్.చక్రవర్తి, ఆర్‌డిఒ సింధు సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, ఎంపిడిఒ కీర్తి స్పందన, తహశీల్దార్ పి.తేజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రపురంలో ర్యాలీలోపాల్గొన్న ప్రముఖులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్

చట్టాలపై అవగాహన ఉండాలి

ఆత్రేయపురం చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కొత్తపేట సివిల్ కోర్టు సీనియర్ జడ్జి ఎం.శ్రీధర్ అన్నారు శనివారం ఆయన మండలంలో లొల్ల గ్రామపంచాయతీ వద్ద గ్రామ సర్పంచ్ కాయలు జగన్నాథం అధ్యక్షతన మండల సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పల్లెల్లో బాల్యవాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని చిన్న వయసులో వారికి సరైన అవగాహన లేక భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడి వేధింపులు కేసులే ఎక్కువ అవుతున్నాయన్నారు పోక్సో చట్టం మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు అల్లు భాస్కరరావు, చైల్డ్ లైన్ సభ్యులు సత్యనారాయణ గ్రామ నాయకులు దాట్ల సూర్యనారాయణ రాజు, మహిళలు పాల్గొన్నారు

కోటిపల్లి రేవులో ప్రయాణాలు పునరుద్ధరణ

ప్రజాశక్తి -రామచంద్రపురం

కోటిపల్లి రేవులో ప్రయాణాలను పునరుద్ధరించారు. కె.గంగవరం, కాజులూరు మండలాలతో పాటు కపిలేశ్వరపురం , పిల్లంక తదితర ప్రాంతాలు ప్రజలకు అమలాపురం తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు కోటిపల్లి ముక్తేశ్వరం రేవును ఉపయోగిస్తారు. గోదావరి నదికి వరదలు రావడంతో రేవు గత నాలుగు నెలలుగా రేవు మూతపడింది. దీంతో నియోజకవర్గం నుంచి కేవలం 20 కి.మీ ప్రయాణం చేసి అమలాపురం చేరుకునే ప్రయాణికులు యానాం మీదుగా అమలాపురం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది దీనితో 50 కి.మీ పైగా ప్రయాణం చేయవలసిన రావడంతో పాటు దూరం పెరగడం ప్రయాణభారంతో ప్రయాణికులు అవస్థలు పడేవారు ప్రస్తుతం వరదలు తగ్గి గోదావరి యదాస్థితికి రావడంతో కోటిపల్లి రేవు నిర్వాహకులు ప్రయాణాలను పునరుద్ధరించారు.


కోటిపల్లి రేవులో పంటు ఎక్కుతున్న ప్రయాణికులు

పరిశోధనా కేంద్రంలో 'కొబ్బరి జీన్ బ్యాంక్'

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట వైఎస్ఆర్ ఉద్యాన పరిశోధనా స్థానంలో కొబ్బరిలో జీన్ బ్యాంక్ ను శనివారం ఉపకులపతి డాక్టర్ టి.జానకిరాం ప్రారంభించారు. కొబ్బరిలో సంకరజాతి రకాలు దేశావళి రకాలు ఏర్పాటు చేసి రైతులకు, సందర్శకులకు, శాస్త్రవేతలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అరటి టిష్యూ కల్చర్ మొక్కలు నాటి ప్రాధాన్యత వివరించామన్నారు. నూతన కార్యక్రమాలు ప్రారంభించిన అధిపతి బి.శ్రీనివాసులు, సిబ్బంది, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఉద్యాన కళాశాల వెంకటరామన్నగూడెం, పార్వతీపురం, ఎపి బిఎస్‌సి(హార్టీకల్చర్) విద్యార్థులు, గ్రామీణ ఉద్యాన కషి బిఆర్‌కె ప్రాముఖ్యతలను వివరించే నాటకాలను వీక్షించారు. సదస్సులో డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం అధికారులు డాక్టర్ ఎఎస్.పద్మావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి -అయినవిల్లి

ట్రాఫిక్ నిబంధనలు ఎవరైనా అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని అయినవిల్లి ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన ముక్తేశ్వరం ప్రధాన రహదరిపై వాహన తనిఖీలు నిర్వహించి రికార్డులు సక్రమంగా లేని వాహనాలకు జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు సాయంత్రం 5 గంటల నుంచి ప్రమాదాలు అధికంగా జరగడం వల్ల ఆ సమయంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆ దే శిం చా ర న్నా ర ు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించా లన్నారు.

జర్నలిజంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -అమలాపురం రూరల్

పట్టణంలో శనివారం వెంకటేశ్వర డిగ్రీ కళాశాల్లో జర్నలిజంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సు నిర్వహించారు. సీనియర్ పాత్రికేయులు ముక్కామల చక్రధర్ మాట్లాడుతూ నేటి యువత జర్నలిజంలో రాణించాలంటే విస్తృతమైన అధ్యయనంతో పాటు పరిశీలన ఉండాలని పేర్కొన్నారు. విలువలతో కూడిన జర్నలిజం ఎప్పటికీ నిలిచి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాత్రికేయులు కడలి సూరిబాబు, సమయమంతుల హరిబాబు, కళాశాల కరస్పాండెంట్ కెవిఆర్ఎన్. నరసింహారావు, ప్రిన్సిపల్ కె.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



దాతలకు చిత్రపటం అందిస్తున్న దృశ్యం

అన్నదాన నిధికి విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి బాల బాలాజీ స్వామి శాశ్వత అన్నదాన ట్రస్ట్‌కు ఎన్‌టిఆర్ జిల్లా పటమట లంక కు చెందిన దానేపూడి వెంకట పూర్ణ శ్రీరామ చంద్ర ప్రసాద్, అంజనాదేవి దంపతులు శనివారం రూ.1లక్షా 11 శనివారం విరాళం ఇచ్చినట్లు ఎసి ఎమ్.కె.టి.నాగ వర ప్రసాద్ తెలిపారు. దాత దంపతులకు స్వామివారి చిత్రపటం ప్రసాదములు అందజేసి అభినందించారు.

చంద్రబాబుపై దాడికి ఖండన

ప్రజాశక్తి-అమలాపురం

నందిగామలో చంద్రబాబు వాహనంపై దాడి యత్నాన్ని సిపిఎం ఖండిస్తోందని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక దుండగుడు విసిరిన రాయి దెబ్బకు సెక్యూరిటీ గార్డు గాయపడ్డారని, ప్రధాన ప్రతిపక్ష నాయకునికి భద్రత కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. దాడి చేసిన దుండగునిపై తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలని, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్‌చేస్తోందన్నారు.

'జలజీవన్'తో ప్రతి ఇంటికీ తాగునీరు

ప్రజాశక్తి - మామిడికుదురు

ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించడమే జలజీవన్ మిషన్ లక్ష్యమని ఎంపిడిఒ కారుపల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. జలజీవన్ మిషన్ కోనసీమ సేవా మండలి డివిజన్ కో ఆర్డినేటర్ బి.చందు ఆధ్వర్యంలో మండంలోని ఆదుర్రు గ్రామ సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. అనంతరం గ్రామంలో వర్షపు నీటి ఒడిసి పడదాం-నీటి వనరులను సంరక్షించుకుందాం తదితర నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి బివివి.సత్యనారాయణ, జెఎబిసి డి.సురేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆదుర్రులో జలజీవన్ మిషన్ అవగాహన ర్యాలీ


ఎన్.పెదపాలెం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ చిట్టిబాబు

జల జీవన్ పనులకు ఎంఎల్ఎ భూమి పూజ

అయినవిల్లి మండలంలోని పలు గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులకు పి.గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు శనివారం భూమి పూజచేశారు. యన్.పెదపాలెం గ్రామ పంచాయతీ, టి.సావరం స్కూల్ బిల్డింగ్ వద్ద జలజీవన్‌మిషన్ నిధులతో ఇంటింటికి మంచినీరు అందించేందుకు పైపులైన్లు వేయుటకు, క్రాప గ్రామ సచివాలయం వద్ద ఇంటింటికి మంచినీరు అందించే కార్యక్రమంలో భాగంగా నూతనంగా పైపులైన్లు వేయుటకు రెండు గ్రామాల్లో కలిపి సుమారు రూ.90 లక్షలవ్యవంతో పైప్ లైన్ నిర్మాణ పనులకు ఎంఎల్ఎ భూమిపూజ చేశారు ఈ కార్యక్రమంలో ఎంపిపి మట్టపర్తి నాగ విజయలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, యన్.పెదపలెం సర్పంచ్ శీలం వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు వార జయ సావిత్రి, గుత్తుల నాగబాబు, దాసరి నటరాజు వివిధ గ్రామ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, సొసైటీ చైర్మన్లు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'ప్రతిపక్ష నాయకులకు భద్రత కరువు'

ప్రజాశక్తి -కాట్రేనికోన


ప్రతిపక్ష నాయకులకు, కార్యకర్తలకు రాష్ట్రంలో భద్రత కరువైందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మోకా ఆనంద్ సాగర్ అన్నారు. శనివారం కాట్రేనికోనలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేత చంద్రబాబుపై రాళ్ల దాడి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఇంటి వద్ద రెక్కి నిర్వహించడం వంటి ఘటనలను ఖండించారు. రాష్ట్రంలో అరాచక పాలన అంతమొందించడానికి ప్రతిపక్షాలన్నీ ఏకం కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకొని ఇష్టానుసారంగా ప్రతిపక్ష నాయకులను అక్రమ అరెస్టులు చేస్తోందన్నారు. ప్రతిపక్షాలు తమ బాధ్యతలు నిర్వర్తించకుండా అధికారపక్షం అడ్డుకుంటుందన్నారు. పంచాయతీ నిధులను పంచాయతీ తీర్మానం లేకుండా ఖర్చు చేస్తే సర్పంచ్‌పై అనేక చర్యలు తీసుకునే ప్రభుత్వం రాష్ట్రంలోని పంచాయతీల సొమ్మును ఇష్టానుసారంగా ఇతర అవసరాలకు మళ్లిస్తోందని ఇటువంటి పనులు చేస్తున్న వారిపై కేసు ఎందుకు పెట్టకూడదని ప్రశ్నించారు. రాష్ట్రంలో అన్ని పనుల విషయంలోనూ నియంతలా వ్యవహరిస్తూ ప్రతిపక్షాల హక్కులను ప్రభుత్వం హరిస్తుందన్నారు. ఉద్యోగాలు ఇస్తానని చెప్పి నిరుద్యోగులను ప్రభుత్వం నిలువునా మోసం చేసిందన్నారు. ఎస్‌సి, బిసి కార్పొరేషన్ లను నిర్వీర్యం చేసి యువత కు ఉపాధి అవకాశాలు లేకుండా చేసిందని ఆరోపించారు.సిఎం జగన్ ను ఎదుర్కేనేందుకు టిడిపి, జనసేన, బిజెపి, సిపిఐ, సిపిఎం, బిఎస్‌పి లాంటి పార్టీలన్నీ ఏకమయ్యే రోజులు రానున్నాయన్నారు. 2024 లో జరిగే ఎన్నికల్లో అధికార పార్టీ కి ఓటమి తప్పదని ఆయన అన్నారు.


వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న వాలంటీర్ స్వామి

ఏలూరు వెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి -మండపేట

పట్టణంలోని 12వ వార్డు 6వ సచివాలయ పరిధిలోని పెన్షన్ లబ్ధిదారురాలు దొంతంశెట్టి పల్లాలమ్మ అనారోగ్యం కారణంతో ఏలూరులో తన కుమార్తె ఇంటి వద్ద ఉంటోంది. అయితే ఆ వార్డు వాలంటీర్ల దార్ల స్వామి పింఛన్ ఇస్తున్నామని వృద్ధురాలికి ఫోన్ చేయగా అనారోగ్యం కారణంగా రాలేక పోతున్నానని చెప్పింది. దీంతో పింఛన్ సొమ్ములు ఆమెకు అందజేయాలని స్వామి తన సొంత ఖర్చులతో ఏలూరు వెళ్లి పింఛను సొమ్మును వృద్ధురాలికి అందజేశాడు. స్వామిని పలువురు అభినందించారు.


చెక్కు అందజేస్తున్న శ్రీనివాసరావు

బాధితునికి రూ.50 వేల సాయం

ప్రజాశక్తి - ఆలమూరు

చొప్పెల్లకు చెందిన అన్యం వెంకట్రావు ప్రమాదవశాత్తు ఇటీవల గాయపడి చికిత్స పొందుతున్నారు. వెంకట్రావు జనసేన పార్టీలో క్రియాశీలక సభ్యులుగా ఉండడంతో అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాలతో పార్టీ మెడికల్ ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన రూ.50 వేల చెక్కును శనివారం కొత్తపేట నియోజకవర్గ ఇంఛార్జ్ బండారు శ్రీనివాసరావు అందజేశారు కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ల డేవిడ్, మండల అధ్యక్షులు సూరపురెడ్డి సత్య, కొత్తపల్లి నగేష్, గ్రామ పార్టీ అధ్యక్షులు సోము గంగాధరం తదితరులు పాల్గొన్నారు.


రిఫ్రాక్టో, కెరటో మీటర్‌ను ప్రారంభిస్తున్న సంస్థ బోర్డ్ సభ్యుడు

అత్యాధునిక పరికరాలతో వైద్యసేవలు

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట లీజర్ రైట్ ఐ కేర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఉమెన్స్ హాస్పటల్‌కు అత్యాధునిక రిఫ్రాక్టో, కెరటో మీటర్‌ను సంస్థ బోర్డ్ మెంబర్ విజయ, సైమన్ ద్వారా శనివారం ప్రారంభించారని సంస్థ సూపరింటెండెంట్ హెవార్డ్స్ రాజు తెలిపారు. అత్యాధునిక పరికరాలతో అందిస్తున్న వైద్య సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

అంబాజీపేట ఎఎంసి మాజీ చైర్మన్ మృతి

ప్రజాశక్తి - అంబాజీపేట


బాబులు (ఫైల్ ఫొటో)

అంబాజీపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గణపతి నాగ సత్యనారాయణ (బాబులు)(70) శనివారం ఉదయం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు సంతోష్ సర్జికల్ గ్యాస్ట్రో సెంట్రాలజీ వైద్యులుగా విధులు నిర్వహిస్తున్నారు. బాబులు రెండుసార్లు మండల టిడిపి అధ్యక్షులుగా, రెండు పర్యాయాలు 1993-95 వరకూ అంబాజీపేట సొసైటీ అధ్యక్షులుగా, కోనసీమ ఆయిల్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గా రెండు పర్యాయాలు సేవలందించారు. ఎఎంసి అభివృద్ధిలో మాజీ మంత్రి దివంగత మెట్ల సత్యనారాయణరావు సహకారంతో కీలకపాత్ర పోషించారు. ఆయన మృతికి సంతాపం కోనసీమ కోప్రామర్చంట్స్ అసోషియేషన్ ఆధ్వర్యం లో వ్యాపార సంస్థలు మూసివేశారు. బాబులు మృతి పట్ల ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎంపిపి డివివి. సత్యనారాయణ, పి.గన్నవరం సర్పంచ్ బొండాడ నాగమణి, మాజీ జెడ్పిటిసి సభ్యుడు పెదబాబు, మద్దాల పెద్దకాపు, ఆరుమిల్లి లాల్ బాబు, మందపాటి కిరణ్ కుమార్, మొల్లేటి శ్రీనివాస్, నాగబత్తుల వెంకట సుబ్బారావు, మాజీ ఎంఎల్ఎ పాముల రాజేశ్వరి దేవి తదితరులు పరామర్శించారు.

క్రీడా సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -అమలాపురం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ అనురాధ

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వారు త్వరలో నిర్వహి ంచనున్న జగనన్న క్రీడా సంబరాలు సంబంధించిన లోగోను శనివారము అల్లవరం మండలం మొగళ్లమూరులో ఎంపీ చింతా అనురాధ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ సురేష్, భీమేశ్, కనకదుర్గ, సత్యనారాయణ, కామేష్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

అంగన్‌వాడీ వర్కర్స్, యూనియన్ జిల్లా మహాసభ

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ఈదరపల్లి అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ లో శనివారం అంగన్‌వాడీ వర్కర్స్, యూనియన్ జిల్లా మహాసభ శనివారం నిర్వహించారు ముఖ్య అతిథిలుగా జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు కె.కృష్ణవేణి, చంద్రావతి, సిఐటియు కార్యదర్శి జి.దుర్గాప్రసాద్‌లు హాజరై ప్రసంగించారు. అనంతరం అమలాపురం ప్రాజెక్టు కమిటీ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా విజయ, బేబీ గంగారత్నం లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కారెం వెంకటేశ్వరరావు, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కన్వీనర్ పచ్చిమాల వసంత కుమార్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఫాతిమా బేగం, అంగన్‌వాడీ వర్కర్స్ సెక్టార్ లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

భవానీ మృతికి కారకుల అరెస్ట్‌కు డిమాండ్

ప్రజాశక్తి -అమలాపురం

చల్లపల్లి పంచాయతీ కార్యదర్శి ఎస్‌టి మహిళా ఉద్యోగిని రొడ్డ భవాని మృతికి కారకులైన వైసిపి నాయకుడు దంగేటి రాంబాబును అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేస్తూ భవాని న్యాయ పోరాట సమితి డిమాండ్ చేసింది. భవాని న్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 65వ రోజుకి చేరుకున్నాయి. టిడిపి నాయకులు పోతుల సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ నాలుగు నెలలు కావస్తున్నా పంచాయతీ సెక్రెటరీ భవాని ఆత్మహత్యకు కారకుడైన దంగేటి రాంబాబు ను అరెస్ట్ చేయకుండా అధికారులు ప్రభుత్వం నిందితుడిని కాపాడుతున్నారని ఆరోపించారు. దీక్షలో బొంతరమణ, పోలమురీ సురేష్ ,అయితా బత్తుల ఈశ్వర్ , డేవిడ్ అంబేద్కర్ తదిత పాల్గొన్నారు.


శివ ల గ్రామం లో రైతులతో అవగాహన సదస్సు

అర్హులు ఆర్‌బికెల్లో దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి -రామచంద్రపురం

కౌలు రైతుగా అర్హతలు ఉండి లబ్ధి పొందని కౌలు రైతులు ఆర్‌బికెల్లో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఇళ్ల సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఆయన కె.గంగవరం మండలం లో శివల ఆర్‌బికెలో జరిగిన ఇ-క్రాప్ సోషల్ ఆడిట్ గ్రామసభ లో పాల్గొని ప్రసంగించారు. గ్రామ సర్పంచ్ అనుసూరి సాయిబాబు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో వైసిపి నాయకులు నిడదవోలు సుబ్రహ్మణ్యం, గుడిగళ్ల గ్రామ సర్పంచ్ పిల్లి సూర్యనారాయణ పాల్గొన్నారు. పలువురు మాట్లాడుతూ మాట్లాడుతూ ఇ-క్రాప్ నమోదైన రైతులంతా వారి పేర్లు, విస్తీర్ణం, సర్వే, ఖాతా నెంబర్లు, పంట రకం తదితర వివరాలను సరిచూసుకోవాలని, మార్పులు ఆర్‌బికెల్లో దరఖాస్తుచేససుకోవాలన్నారు. వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ ఇక్రాప్ చాలా ప్రధానమని, ప్రభుత్వం నుంచి అన్ని పథకాలు, రాయితీలు ఇ క్రాప్ అయితేనే వస్తాయన్నారు.

సిహెచ్‌సి అభివృద్ధి కమిటీ సమావేశం

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

స్థానిక కపిలేశ్వర పురం సిహెచ్ సి లో శనివారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో కమిటీ చైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొన్నారు. ఆస్పత్రిలో ఆరుగురు స్టాఫ్ నర్సులు, ఒక హెడ్ నర్స్, ఎన్‌హెచ్ఎం నుంచి ఐదుగురు నర్సులతో మొత్తం 12 మంది సిబ్బందికి గాను,ఎన్ హెచ్ ఎం నుంచి ఒక నర్స్ మాత్రమే పనిచేస్తున్నట్లు వైద్యాధికారి ఎంఎల్ఎ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంటనే స్పందించి డిఎంహెచ్ఒతో ఫోన్లో మాట్లాడారు. పోస్టుల భర్తీకి వెంటనే చర్యలు తీసుకోవాలని కనీసం నలుగురు నర్సులు అయినా నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యాధి కారులు, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ప్రజలతో ఆడడం
అలవాటైపోయింది మరి..!!



ఇంజనీరింగ్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఏజెఎఫ్ సి మెజిస్ట్రేట్ హర్షవర్ధన్

కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం పెద్దాపురం మండల న్యాయ శాఖాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఏజెఎఫ్‌సి మెజిస్ట్రేట్ జి.హర్షవర్ధన్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరి జీవితం న్యాయవ్యవస్థతో ముడిపడి ఉంటుందన్నారు. విద్యార్థి దశనుండే చట్టాలపై అవగాహన పెంపొందించుకొని సమాజంలో సామాన్య జనానికి చట్టాలపై అవగాహన పెంచాలన్నారు. సీని షేక్ అబ్దుల్ నబీ మాట్లాడుతూ దిశ చట్టం మహిళలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులతో నిర్వహించిన చట్టాలపై అవగాహన ర్యాలీని మెజిస్ట్రేట్ హర్షవర్ధన్ ప్రారంభించారు. ఈ ర్యాలీ దివిలి, చంద్రమాంపల్లి మీదుగా కొనసాగింది. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బేబినీడి శ్రీనివాసరావు,అడ్మినిస్ట్రేటివ్ అధికారి జెన్నిబాబు,ఏవో సందీప్,ప్యానల్ న్యాయవాదులు మడికి రాంబాబు, ఎస్ విశాలాక్షి, పారా లీగల్ వాలంటీర్లు సూతలపాటి అప్పలకొండ,ఆకుల మురళీకృష్ణ,మాసా చంద్రరావు, కుంచె నాని బాబు, రమేష్ పాల్గొన్నారు.

అన్నవరం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో చైర్‌పర్సన్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరంలో ఉన్న ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్‌ను ఎపిఎస్ జోనల్ చైర్మన్ గదుల బంగారమ్మ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శనివారం ఆమె ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో వివిధ స్టాల్స్‌ను, క్యాంటీన్‌ను పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడారు. అన్నవరం రద్దీకి తగ్గట్టుగా ప్లాట్ ఫామ్‌ల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కాంప్లెక్స్ పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. అలాగే కార్గో పాయింట్ విస్తృత పెంచాలన్నారు. తాను త్వరలో ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చేసేందుకు ఆమె తెలిపారు. ఆమె వెంట జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు, తుని ఆర్‌టిసి డిపో మేనేజర్ కిరణ్ కుమార్ ఉన్నారు.

నైపుణ్య అభివృద్ధి తోనే ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి - పెద్దాపురం

ఇంజినీరింగ్ విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగు పరచుకోవడం ద్వారానే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ బేబినీడి శ్రీనివాసరావు అన్నారు.శనివారం పెద్దాపురం మండలం దివిలి గ్రామంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ప్రత్యేక ఓరియంటేషన్ తరగతుల ప్రారంభ సభలో ఆయన ప్రసంగించారు. ప్రిన్సిపాల్ సర్వ రామకృష్ణుడు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భాషాపరమైన, సాంకేతిక పరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. కళాశాల అడ్మినిస్ట్రేటివ్ అధికారి జెన్నిబాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించడం ద్వారానే ఉన్నత లక్ష్యాలను సాధించగలరన్నారు. సివిల్ డిపార్ట్మెంట్ హెడ్ వీరేంద్ర చౌదరి, కళాశాల అకాడమిక్ డైరెక్టర్లు వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధిపతులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం నిర్మాణం పై విచారణ

ప్రజాశక్తి - కాజులూరు

ఆరోగ్య కేంద్రం నిర్మాణంపై కలెక్టర్ స్పందన కార్యక్రమంలో శలపాక గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుపై శనివారం తహశీల్దార్ సత్యనారాయణ ఇన్‌చార్జ్ ఎంపిడిఓ ఇందిరాదేవి విచారణ నిర్వహించారు. శలపాక గ్రామంలో పాఠశాల చెంతనే ప్రభుత్వ స్థలం ఉండటంతో ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించడానికి చర్యలు తీసుకున్నారు.ఈ క్రమంలో గ్రామానికి చెందిన కొంతమంది పాఠశాల చెంతనే ఆరోగ్యకేంద్రం ఉండటం వల్ల విద్యార్థులకు ఇబ్బందిగా ఉంటుందని కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేయడంతో తహశీల్దార్ సత్యనారాయణ, ఇన్‌ఛార్జి ఎంపిడిఓ ఇందిరాదేవి సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుండి వివరాలు సేకరించారు. నివేదికను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపించనున్నట్లు తహశీల్దార్ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ వేంకటేశ్వరరావు పంచాయతీ కార్యదర్శి అరుణకుమారి గ్రామ రెవెన్యూ అధికారి గనికమ్మ సర్పంచ్ పి.గనిరాజు ఎంపిటిసి సభ్యులు దడాల రమేష్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ పెద్దిరెడ్డి నాగేశ్వరరావు సచివాలయ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

10 న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 10వ తేదీ గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జ్ ఎంపిడిఓ సీహెచ్. ఇందిరాదేవి శనవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి ఎంపిటిసి సభ్యులు సర్పంచ్లు హాజరుకావాలని డివిజన్ , మండలస్థాయి అధికారులు తమ శాఖ నివేదికలతో హాజరుకావాలని కోరారు.

గోదావరి గలగలలు

ఆవేదన... ఆందోళన...

ఆవేదన.... ఆందోళన...

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో జ్వరాలు మళ్లీ విజృంభిస్తున్నాయి. వాతావరణ మార్పులు ఓ వైపు, పారిశుధ్య నిర్వహణ లోపం మరో వైపు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం కన్పిస్తోంది. గతేడాదితో పోల్చితే డెంగీ, టైఫాయిడ్ కేసులు గణనీయంగా పెరిగాయి. ఈ నేపథ్యంలో ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. పిహెచ్‌సిలలో సిబ్బంది కొరత నేపథ్యంలో పల్లెల్లో ప్రైవేట్ క్లినిక్‌లను ఆశ్రయించక తప్పటం లేదని రోగులు వాపోతున్నారు. అప్పటికీ తగ్గకపోతే జిల్లా కేంద్రాల్లోని ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రలలో వైద్యం కోసం పరుగులు తీస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఫ్యామిలీ ఫిజీషన్ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం విధితమే. కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ కొన్ని ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఇంటింటికీ తిరిగి ప్రజల ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుంటోంది. విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి జనవరి నుంచి పూర్తి స్థాయిలో ఫ్యామిలీ ఫిజిషియన్‌సేవలు అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం చెబుతోంది. వాటితో పాటు ప్రస్తుతం ప్రభుత్వ పిహెచ్‌సిలలో మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకూ పరీక్షే..

పాఠశాల విద్య పరీక్షల విధానంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న విధానం విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయులకూ పరీక్షలా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ విధానంలో 1, 2 తరగతుల విద్యార్థులకు ప్రశ్నపత్రాల్లోని అన్ని ప్రశ్నలు టీచర్లు చదివి వినిపించి వారితో అందులోనే జవాబులు గుర్తించాలి. ఈ రెండు తరగతుల విద్యార్థులకు ఓఎంఆర్ షీట్‌లో జవాబులను టీచర్లే బబుల్ చేయాలి. 3వ తరగతి విద్యార్థులకు నాలుగు ప్రశ్నలు, 4, 5 తరగతుల విద్యార్థులకు ఒక్కో ప్రశ్నను పెద్దగా చదివి విద్యార్థులకు వినిపించి ఓఎంఆర్ షీట్‌లో జవాబులను బ్లూ లేదా బ్లాక్ బాల్‌పాయింట్ పెన్నుతో దిద్దాలి. ఈ విధానం తలనొప్పిగా మారిందని టీచర్లు వాపోతున్నారు. పాఠశాలలు ప్రారంభమైన తర్వాత ఎట్టకేలకు 4 నెలల అనంతరం జరిగే ఈ పరీక్షలు గందర గోళంగా మారాయి. మొత్తం ఆరు సబ్జెక్టులకు ఒకే ఒఎంఆర్ షీట్‌ను అందజేసి ప్రతి రోజూ భద్రపర్చటం తిరిగి విద్యార్థికి అందజేయాలనే నిబంధనలు తలనొప్పిగా మారాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ అనాలోచిత విధానాల ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో గతేడాది వెల్లడైన ఫలితాలే పునరావృతమవుతాయనే ఆందోళన తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతోంది.

చిగురించిన ఆశలు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఏలేరు కుడి కాల్వకు రూ.50 కోట్ల నిధులు మంజూరు చేయటంతో మెట్ట ప్రాంత రైతుల ఆశలు చిగురించాయి. గోకవరం మండలంలో గుమ్మళ్ల దొడ్డిలో బయో ఇథనాల్ ఉత్పత్తి పరిశ్రమ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చిన విషయం విధితమే. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో జగ్గంపేట ఎంఎల్‌ఏ జ్యోతుల చంటిబాబు కుడికాల్వకు నిధులు కేటాయించాలని కోరటంతో సభ అనంతరం ముఖ్యమంత్రి నిధులు మంజూచేసినట్లు తెలిపారు. త్వరిత గతిన పనులు ప్రారంభించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలు వివిధ సమస్యలపై నిర్వహించిన ఆందోళలపై పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. 'అయ్యన్న' అరెస్టుకు వ్యతిరేకంగా జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో చేపట్టిన ఆందోళనలను పోలీసులు భగ్నం చేశారు. బయో ఇథనాల్ సంస్థ ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసనలకు పిలుపు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులను నిర్బంధానికి గురి చేశారు. సమస్యలను విన్నవించేందుకు ప్రయత్నించిన జనసేన పార్టీ కార్యకర్తలను సైతం అడ్డుకున్నారు. మొత్తం మీద కట్టుదిట్టమైన భద్రతా బలగాల మధ్య ముఖ్యమంత్రి సభను ముగించేశారనే అభిప్రాయం ప్రజలు, ప్రతిపక్ష పార్టీలలో వ్యక్తమైంది.

విద్యార్థుల ఆందోళనలు

కందుకూరి విద్యా సంస్థల ప్రహరీ లోపల ఉన్న ఆస్తుల మొత్తాన్ని ప్రభుత్వానికి అప్పచెప్పాలని విద్యార్థి సంఘం ఎస్‌ఎఫ్‌ఐ దశల వారీ ఆందోళనలు చేపట్టింది. రాష్ట్ర మంత్రులను కలిసి వినతిపత్రాలను అందజేశారు. నిరుపేదలకు విద్య, వితంతు వివాహాలు, అనాధ శరణాలయాల కోసం కందుకూరి వీరేశలింగం ఈ సమాజాన్ని స్థాపించారు. ఉన్నత ఆశయాల కోసం స్థాపించిన ఈ ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రజలు, ప్రజా సంఘాలు, విద్యార్థులు కోరుతున్నారు.

కబ్జాల నుండి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలి

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

కబ్జాల నుండి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని పిఠాపురం మాజీ ఎంఎల్‌ఎ ఎస్‌విఎస్‌ఎన్ వర్మ అధికారులను కోరారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉప్పాడ పంచాయతీ పరిధిలో ఉన్న సూరాడ పేట గ్రామానికి ఇళ్ల స్థలాలకు, అవసరాలకు కేటాయించిన స్థలాన్ని వైసిపి పార్టీ నాయకులు కబ్జా చేసి అమ్ము కుంటున్నారని సూరాడపేట గ్రామానికి చెందిన కొంతమంది శనివారం పిఠాపురం టిడిపి కార్యాలయంలో మాజీ ఎంఎల్‌ఎ వర్మని కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. దీనిపై స్పందించిన వర్మ ఫోన్ ద్వారా అధికారులతో చర్చించి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయంలో ఈ ప్రాంతానికి చెందినా వారికీ ఇళ్ళ స్థలాలు కొరకు, ప్రజలు అవసరాల మేరకు కమ్యూనిటీ హాల్, పిల్లలకు స్కూల్ నిమిత్తం లే-అవుట్ చేసి ఇచ్చిన భూమిని సెంటు రూ.2 లక్షలు చొప్పున ఈ కమ్యూనిటి స్థలం విలువ 70లక్షలకు అమ్మేశారని ఆరోపించారు. అలాగే మెయిన్ రోడ్ లో అన్నా క్యాంటిన్ కొరకు కేటాయించిన స్థలాన్ని కూడా వైసిపి ఎంఎల్‌ఎ రూ.50 లక్షలకు అమివేశా రని ఆరోపించారు. గ్రామ మత్స్యకార ప్రజలు ప్రభుత్వ ఆస్తిని కాపాడమని పలు మార్లు ఫిర్యాదు చేసినప్పటికి ఎంఎల్‌ఎ ఒత్తిడి వలన ఏమి చేయలేని పరిస్థితిలో స్థానిక అధికారులు ఉన్నారని తెలిపారు. తక్షణమే ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ స్థలాలు అక్రమాలు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అనిశెట్టి సత్యానంద రెడ్డి, సూరాడ నాగేశ్వరరావు, చోడిపల్లి ప్రసాద్, మెరుగు భూషణం, చొక్కా కష్ణ, సూరాడా జాను, కోడా కష్ణ, సత్తిరాజు, కృష్ణ, అప్పన్న మత్స్యకార నాయకులు పాల్గొన్నారు

మన్యంవారిపాలెం విఆర్‌ఒకు సస్పెన్షన్ ఉత్తర్వులు

ప్రజాశక్తి - కాకినాడ

జగ్గంపేట మండలం, మన్యంవారిపాలెం గ్రామంలో గ్రేడ్-2 విఆర్‌ఓ గా పనిచేస్తున్న బెల్లపు రాజు ను పట్టాలదారు పాసు పుస్తకాల జారీ, భూముల రిజిస్ట్రేషన్ అంశాల కొరకు రామవరం, మన్యంవారిపాలెం రైతుల నుండి సొమ్ము వసూలు చేసి అవినీతికి పాల్పడినందుకు, ఇర్రిపాక గ్రామ లబ్ధిదారులకు ఓటిఎస్ పట్టాలను పంపిణీ చేయనందుకు, మద్యం సేవించి విధులకు హాజరు కావడం, తరచుగా గైరుహాజరు కావడం కారణాలపై సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఉత్తర్వులు జారీ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షులు పద్మనాభం

త్వరలో పెన్షనర్స్ 'మనం-మన కోసం'

ప్రజాశక్తి - కాకినాడ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల కొరకు ఏవిధమైన ప్రీమియం లేని మనం-మనకోసం సంక్షేమ పథకం త్వరలో ప్రారంభమవుతుందని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు కె.పద్మనాభం, కార్యదర్శి శాస్త్రి తెలిపారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశం శనివారం కాకినాడలోని పెన్షనర్స్ భవన్ లో జరిగింది. నూతన జిల్లాల ఏర్పాటుతో అసోసియేషన్ కోనసీమ, రాజమండ్రి శాఖలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. యురాలజిస్ట్ డాక్టర్ సిహెచ్. కరుణాకర్‌రెడ్డి వృద్ధుల సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ నెల 19న పురుషుల దినోత్సవాన వన సమారాధన జరుగుతుందన్నారు.



టైలర్ కు కుట్టు మిషన్‌అందజేస్తున్న హరీష్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

బాధిత కుటుంబానికి కుట్టు మిషన్ అందజేత

ప్రజాశక్తి-కరప

వేళంగిలో జరిగిన అగ్నిప్రమాదంలో టైలర్ కొప్పిశెట్టి లొవరాజు వికలాంగుడు ఉపాధి కోల్పోయిన సంగతి తెలుసుకున్న కాకినాడ పట్టణానికి చెందిన తలాటం హరీష్ తమ హరీష్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సహాయం అంద జేశారు. బాధిత టైలర్ కుటుంబానికి ట్రస్ట్ ద్వారా రూ.11,000తో కుట్టు మిషన్‌ను ఒక మోటారును అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సవిలే నీలిమ రాజేష్, సాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే క్లీన్ కాకినాడ

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజల సహకారంతోనే స్మార్ట్ సిటీ ని క్లీన్ కాకినాడగా చేయగలమని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు పేర్కొన్నారు. శనివారం ఆయన14వ సర్కిల్ పరిధిలోని గోకులం, ఐడియల్ కళాశాల ప్రాంతాలలో పారిశుధ్య పనులను పర్యవేక్షిం చారు. కొన్నిచోట్ల చెత్తను రోడ్లపై వేయడాన్ని గమనించారు. మరికొన్నిచోట్ల వేర్వేరుగా డస్ట్ బిన్ లు అందుబాటులో ఉన్నప్పటికీ తడి పొడి చెత్తను కలిపి ఇస్తున్న విషయాన్ని గుర్తించారు. ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం వల్లే కొన్నిచోట్ల ఇటువంటి పరిస్థితి ఎదురవుతోందని, దీనిపై శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రీలు చొరవ తీసుకుని ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్స్పెక్టర్ రాధాకష్ణ సచివాలయ కార్యదర్శులు సిబ్బంది ఉన్నారు.

నేడు వికాస జాబ్ మేళా

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్:

వికాస, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ " ఆధ్వర్యంలో ఈ నెల 06 వ తేదీ ఆదివారం పి.ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, కాకినాడలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస పీడి కరణం లచ్చారావు ఓ ప్రకటనలో తెలి పారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ ఎం.ఎన్.సి, సాఫ్ట్వేర్ , ఫార్మా , బ్యాంకింగ్, టెక్నికల్ తదితర 60కు పైగా కంపెనీల్లో సుమారు 3000 కు పైగా ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని, దివ్యాంగులకు, అనాథలకు కూడా వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. హెచ్.సి.ఎల్, సాగర్సాఫ్ట్ సొల్యూషన్స్, హాల్మార్క్ గ్లోబల్ టెక్నాలజీస్, మేకర్మైమైండ్ సాఫ్ట్ సొల్యూషన్స్, గెట్స్ హెల్త్ కేర్ సొల్యూషన్స్, సదర్ల్యాండ్స్, అపోలో హాస్పటల్స్, సైలెంట్ మైండ్స్, డ్రీమ్, ఐటెక్ సాఫ్ట్వేర్ సొల్యూషన్, ఐ.సి.ఐ.సి.ఐ (నిట్) బ్యాంక్, హెచ్.డి.ఎఫ్.సి, ఎస్‌ఐ తదితర ప్రముఖ కంపె నీల్లో ఉద్యోగాలకు ఎస్.ఎస్.సి నుండి పి.జి వరకు ఉత్తీర్ణులైన 18 నుండి 40 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ.12,000/- నుండి రూ.50,000/ వరకు జీతం ఇన్సెంటివ్స్ ఉచిత వసతి, భోజనం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థుడ లందరూ ఈనెల 06 వ తేదీ ఆదివారం పి.ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, కాకినాడ వద్ద ఉదయం 9 గంటకు సర్టిఫికెట్స్ జెరాక్సతో హాజరుకావలెను. వివరాలకు 8297400666, 7799376111 నంబర్లను సంప్రదించా లన్నారు.

నేరాలు ఘోరాలు

జాతీయ రహదారిపై మహిళ మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట మండల పరిధిలోని రామవరం వద్ద డివైడర్ దాటుతూ పెద్దాపురం మండలం కట్టమూరుకు చెందిన గండేటి వెంకటలక్ష్మిని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికి అక్కడే మృతి చెందినట్లు జగ్గంపేట ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. జగ్గంపేట సిఐ సూర్య అప్పారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మతురాలు వెంకటలక్ష్మి రామవరం లోని సంబంధిత బంధువుల ఇంటికి వస్తున్న సమయంలో జాతీయ రహదారిపై వాహనం ఢీకొనడంతో మతి చెందినట్లు తెలిపారు. వాహనాన్ని ట్రేస్ ఓట్ చేస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేధింపుల కేసులో భర్త, అత్తలకు జైలు శిక్ష

ప్రజాశక్తి - కాకినాడ క్రైమ్

భార్యను వేధించిన కేసులో భర్త, అత్తకు ఏడాదిన్నర జైలు శిక్ష, ఒక్కొక్కరికి 16,000 జరిమానా విధిస్తూ కాకినాడ అదనపు జేఎఫ్‌సిఎం న్యాయమూర్తి కె.మధు స్వామి తీర్పు చెప్పారని కాకినాడ జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. కాకినాడ గ్రామీణ తూరంగికి చెందిన దామి శెట్టి రమాదేవికి వీరేంద్రకుమార్‌తో 2012లో వివాహమైంది. ఆమెను అద నపు కట్నం తీసుకురావాలని భర్త, అత్తలు వేధిం చినట్లు రమాదేవి ఫిర్యాదు మేరకు 2017లో కాకినాడ దిశ మహిళా పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున కేసును రఘువీర్ వాదించారు.

వేధింపుల కేసులో అత్తమామలకు జైలు శిక్ష

కోడల్ని వేధించిన కేసులో అత్తమామలకు ఆరునెలలు జైలు శిక్ష విధిస్తూ కాకినాడ ఒకటో అదనపు జె.ఎఫ్.సి. ఎం.న్యాయమూర్తి కె.మధు స్వామి తీర్పు చెప్పిట్టు కాకినాడ దిశ పోలీసులు ఒక ప్రకటనలో తెలియజేశారు. కాకినాడ గాంధీనగర్‌కు చెందిన తలుపులమ్మ దేవికి అదే ప్రాంతానికి చెందిన శివ కుమార్‌తో 1999లో వివాహమైయింది. 2016లో భర్త, అత్తమామలు, మరిది, తనను శారీరకంగా మానసికంగా వేధిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. వాదోపవాదనలు ను విన్న న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

కోడి పందేలపై పోలీసులు దాడులు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని లింగంపర్తి గ్రామ శివారు, పెద్దనా పల్లిలోనూ కోడి పందాలు, పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సిహెచ్ విద్యా సాగర్ తెలిపారు. వారి వద్ద నుండి రెండు కోళ్లు రూ.3000 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో కాని స్టేబుల్ పండు శ్రీనివాస్ ఈశ్వర్లతో పాటు ఎపిఎస్‌పి సిబ్బంది ఉన్నారు.

నిత్యాన్నదానానికి రూ 1,12,556 విరాళాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం తిరుపతిలోని వల్లభ స్వామి ఆలయం వద్ద అన్నదానం నిర్వహణకు యాత్రికులు శనివారం రూ.1,12,556 విరాళాలుగా అందజే శారని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. పెద్దాపురం పట్టణానికి చెందిన అడపా వీరబాబు నిత్యాన్నదాన పథకానికి రూ.15,001 విరాళంగా అందజేశారన్నారు. వివిధ టిక్కెట్ల ద్వారా శనివారం రూ.1,73,960 ఆదాయం సమకూ రిందన్నారు.

విద్యార్థులు సృజనాత్మకతను అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-మండపేట

విద్యార్థి దశ నుంచే సృజనాత్మకతను అలవర్చుకుంటూ పోటీ పరీక్షలలో పాల్గొనాలని ఎంఇఒ రామచంద్రరావు, మండల అభివృద్ధి అధికారి ఐదం రాజులు అన్నారు. నాసా స్పేస్ ప్రాజెక్ట్ వర్క్ పూర్తిచేసిన తాపేశ్వరం శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులను వారు శనివారం అభినందించారు. అనంతరం ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 2022- 23 సంవత్సరానికి సంబంధించి 36 మంది విద్యార్థులు తమ స్కూల్ నుంచి నాసాకి ఎంపిక కావడం ఆనందదాయకంగా ఉందన్నారు.

మేలైన వ్యవసాయ పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి -అమలాపురం రూరల్

రైతులు మేలైన వ్యవసాయ పద్ధతులు పాటించేలా గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు వారు నిర్వహించు పొలంబడులు, తోటబడుల్లో చూడాలని జిల్లా వ్యవసాయ అధికారి వై.ఆనంద కుమారి పేర్కొన్నారు. శనివారం అమలాపురం వ్యవసాయ సబ్-డివిజన్‌లోని అమలాపురం, అల్లవరం, అయినవిల్లి, ఉప్పలగుప్తం మండలాల గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు అమలాపురం ఎంపిడిఒ కార్యాలయంలో ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.

పేకాట శిబిరం పై దాడి నగదు స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కాటవరం గ్రామ శివారులో శుక్రవారం రాత్రి పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పోలీసలు తెలిపిన వివరాలు ఇవి.. గ్రామ శివారులో పేకాటశిబిరం నిర్వహిస్తురని ఎస్ఐ శుభ శేఖర్ కు సమాచారం అందింది. ఆయన సిబ్బందితో కలిసి పేకాట శిబిరం పై దాడులు చేశారు. ఈ దాడుల్లో ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 7 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల నుంచి 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని పోలీసులు తెలిపారు.

సిఎం జగన్ నిర్ణయంపై హర్షం

ప్రజాశక్తి-మండపేట

. సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా కల్లుగీత కార్మికుల క్షేమం కోసం సిఎం జగన్ తీసుకున్న నిర్ణయం పట్ల మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఎం జగన్ చిత్రపటానికి మండపేట శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం గీత కార్మికులు క్షీరాభిషేకం నిర్వహించారు. గణేశ్వరరావు మాట్లాడుతూ కల్లుగీత కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే చెల్లించే పరిహారాన్ని రూ.ఐదు లక్షల నుంచి రూ.పది లక్షల వరకు ప్రభుత్వం పెంచిందన్నారు. సహజ మరణం చెందితే వైఎస్‌ఆర్ బీమా పథకం ద్వారా రూ.ఐదు లక్షల పరిహారం చెల్లిస్తుంద న్నారు. కార్యక్రమంలో శెట్టి బలిజ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు పెంకే గంగాధర్, కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులో చోరీ

ప్రజాశక్తి - ఆలమూరు

మడికి మద్యం షాపులో శుక్రవారం అర్ధరాత్రి సుమారు రూ.2 లక్షల 17వేల నగదు చోరీ అయ్యింది. ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపిన వివరాలివి.. శుక్రవారం అమ్మకాలు జరిగిన సొమ్మును మద్యం షాపులో పనిచేసే ఉద్యోగులు ఇనుప పెట్టిలో భద్రపరిచి రాత్రికి ఇంటికి వెళ్లారన్నారు. అయితే మద్యం షాప్‌కు ఇద్దరు కాపలాదారులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. వారు చోరీ రాత్రి రెండు నుంచి నాలుగు గంటల ప్రాంతంలో జరిగినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం మద్యం షాప్ ఉద్యోగులు నగదు చోరీ జరిగినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ శివప్రసాద్ కేసు నమోదు చేశారు. సంఘటన స్థలానికి కాకినాడ నేర పరిశోధన సంస్థ (క్లూస్ టీం) చేరుకుని ఆధారాలను సేకరించారు.

సమస్యలు తాళలేక విఆర్‌ఎ ఆత్మహత్య

ప్రజాశక్తి-గోపాలపురం

సగ్గొండ గ్రామపంచాయతీ గోపవరంలో కుటుంబ, ఆర్థిక సమస్యలను తాళలేక విఆర్‌ఎ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. పత్రా సుభాష్ చంద్రబోస్ సగ్గొండ గ్రామపంచాయతీ గోపవరం విఆర్‌ఎగా పనిచేస్తున్నాడు. ఇతనికి ఏడేళ్ల క్రితం అతనికి పక్షవాతం వచ్చింది. అతను కుటుంబ, ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. అయితే అతనికి కుమారుడు నిరుద్యోగి. వివాహమైన కుమార్తెకు భర్త చనిపోయి ఆమె కూడా తండ్రి వద్దే ఉంటోంది. ఈ పరిస్థితులను తట్టుకోలేక చంద్రబోస్ శుక్రవారం ఉదయం తన ఇంటి వద్ద పురుగుమందులు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతనిని వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు. చికిత్స పొందతూ అతను శుక్రవారం సాయంత్రం మరణించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె. రామకృష్ణ తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -దేవరపల్లి

ఫ్యాక్టరీలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మరణించాడు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేశారు. వివరాలు ఇవి.. దేవరపల్లి మండలం గౌరీపట్నం శివారులో త్రివేణి గ్లాస్ ఫ్యాక్టరీలో శుక్రవారం ప్రమాదం చోటుచేసుకుంది. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్ కి చెందిన సురేష్(36) ఫ్యాక్టరీలో తయారయ్యే పాటర్న్ గ్లాసును తీసే సమయం లో కాలు జారి గ్లాసు అంచు మీద పడగా ఎడమ వైపు మెడ దగ్గర తెగి రక్తస్రావమైంది. ఫ్యాక్టరీ సిబ్బంది అతనిని చికిత్స కోసం రాజమహేంద్రవరంలో ఆస్పత్రికి తరలించారు. అతను చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మరణించాడు. ఆస్పత్రి సమాచారం పై కేసు నమోదు చేసి పోస్ట్‌మార్టం చేయించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శనివారం తెలిపారు.

ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి -మండపేట

నియోజకవర్గంలో గత కొద్ది రోజుల నుంచి వరి కోతలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో వరిన కోసిన రైతులు ఆందోళనలో ఉన్నారని దానికి శుక్రవారం కురిసిన వర్షమే నిదర్శనమన్నారు. గత రెండు పంటలకు వాతావరణం అనుకూలించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి త్వరగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

నాడు-నేడుతో విద్యారంగంలో మార్పులు

ప్రజాశక్తి-రాజోలు

నాడు-నేడుతో విద్యారంగంలో మార్పులు తీసుకువచ్చి, ప్రతి ఒక్కరికి కార్పొరేట్ స్థాయి విద్యను అందించడానికి సిఎం జగన్ కృషి చేస్తున్నారని రాజోలు ఎంఎల్‌ఎ రాపాక వరప్రసాదరావు తెలిపారు. శనివారం సఖినేటిపల్లి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల అంతర్వేది, బెల్లంకొండ వారి కొడప నందు మనబడి నాడు-నేడు రెండవ విడత కార్యక్రమంలో భాగంగా రూ. 35,98,714లక్షలతో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సఖినేటిపల్లి జెడ్‌పిటిసి సభ్యురాలు దొండపాటి అన్నపూర్ణ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.